

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి సోమవారం 12-10-2026 సంపుటి: 02 సంచిక : 163 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ల హిమ పావని
Ranga Reddy Monday, 12-10-2026 Volume :02 Issue: 163 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



Contact Number
9059328777

## రైతులు రెండో పంటతో

# నష్టపోవద్దు

ఎల్నినో ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలి



- యూనిట్‌కు రూ.15 చెల్లించినా విద్యుత్తు దొరకని పరిస్థితి
- తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శతవిధాల కృషి
- భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రణాళిక
- సంద్రాన్ని కలిసి తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ కోరతాం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి

ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తూందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నిధులు రూ.1.63 కోట్లతోమంగలితండా--దుబ్బతండా మధ్య నిర్మించనున్న బీటీ రహదారి పనులకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జుజ్జుర్ రావుపేటలో రూ. 45 లక్షలతో చేపట్టనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులకు

-మిగతా 2 లో



02

నేపాల్‌లో మళ్లీ వరద

# బీభత్సం!

నేలమట్టమైన ఇళ్లు, బ్రిడ్జిలు..!

- గోర్ఖా జిల్లాలో అకస్మాత్తుగా విరుచుకుపడిన వరద
- వరద ఉధృతికి 34 ఇళ్లు, పలు వంతెనలు ధ్వంసం
- రెండు గంటల్లో 3.66 నుంచి 8.43 మీటర్లకు పెరిగిన నీటిమట్టం
- తీవ్రంగా దెబ్బతిన్న జలవిద్యుత్ కేంద్రం
- ప్రాణనష్టం లేదన్న విపత్తు నిర్వహణ సంస్థ
- రంగంలోకి దిగిన నేపాల్ సైన్యం.. సహాయక చర్యలు ముమ్మరం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



సిరిసిల్ల జేఎన్‌టీయూ సమస్యలను

# పరిష్కరించండి!

- కొత్త క్యాంపస్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి
- రూ.402 కోట్లతో 2021లోనే పరిపాలనా అనుమతులు
- మండేపల్లిలో 20 ఎకరాల భూమి కేటాయింపు
- నిర్మాణంలో జాప్యంతో విద్యార్థులకు ఇబ్బందులు
- ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనను విరమించాలి
- కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్,

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కళాశాల ప్రస్తుత పరిస్థితులను ప్రస్తావించారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి 2021లోనే రూ.402 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినట్లు

-మిగతా 2 లో

## ఏఐ, అణు యుద్ధంతో
## 2100 నాటికి మానవాళి అంతం

02





సిద్దిపేట గడ్డ నుంచే

# మళ్లీ ఉద్యమం!

- రేవంత్ పాలనలో కృత్రిమ కరువు
- నదుల్లో నీళ్లున్నా ప్రాజెక్టుల మోటార్లు బంద్
- వేల కోట్ల అభివృద్ధి పనులకు బ్రేకులు
- రుణమాఫీ అందని రైతులు 24 వేల మంది
- సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల ముగింపు సభలో హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామని ప్రకటన

హైదరాబాద్,

సిద్దిపేట గడ్డ నుంచే రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రకటించారు. రాష్ట్రంలో నెలకొన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ కరువని ఆరోపించారు. నదుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ సాగునీటి ప్రాజెక్టుల మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి దశాబ్ది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి గోదావరి జలాలతో జలాభిషేకం చేశారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటుతో పాలన ప్రజలకు చేరువైందని హరీశ్‌రావు అన్నారు.

-మిగతా 2 లో

## డ్రగ్స్ పెడ్లర్లకు

# అడ్డాగా గోవా

హైదరాబాద్‌కు గోవా నుంచే మత్తు పదార్థాల సరఫరా



- ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్
- డ్రగ్స్ నియంత్రణలో బీజేపీ ప్రభుత్వం విఫలం
- పేదలు, దళితులు, మైనార్టీల ఓట్లు తొలగించే కుట్ర
- జ్ఞానేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఓట్ల తొలగింపు
- 2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు
- రాహుల్ గాంధీ ప్రతినిధిగా గోవాకు వచ్చా
- పనాజీలో కాంగ్రెస్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- 'గోయ్ రాథోన్స్' యాత్రలో పాల్గొన్న తెలంగాణ సీఎం

హైదరాబాద్,

: గోవా డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా మారిందని, అక్కడి నుంచే హైదరాబాద్‌కు మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. డ్రగ్స్ కారణంగా గోవా ప్రతిష్ట దెబ్బతినకూడదని, యువతను మత్తు పదార్థాల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఆదివారం పనాజీలో కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గోవా పర్యటనకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్యక్రమాల కారణంగా రాలేకపోయారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ప్రతినిధిగా తనను గోవాకు పంపించారని వెల్లడించారు. గోవాలో కాంగ్రెస్ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు.

-మిగతా 2 లో



02

## విండీస్‌పై
# భారత్ విక్టరీ

- సిరీస్‌లో 2-1తో ఆధిక్యం.. ఉప్పల్‌లో నాలుగో టీ20
- మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం
- అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్.. 69 పరుగులతో మెరుపులు
- ఇషాన్ కిషన్ దూకుడు.. చివర్లో తిలక్, అక్షర్ కీలక పరుగులు
- 223 పరుగులకు ఆలౌటైన భారత జట్టు
- 209 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్
- అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో సత్తా
- చివర్లో షమర్ స్ప్రింగర్ పోరాటం వృథా
- అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20



02

## రష్యా--ఉక్రెయిన్ మధ్య
# సీజ్‌ఫైర్!

- ట్రంప్ ప్రకటనతో యుద్ధానికి విరామం?
- తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని వెల్లడి
- ట్రూత్ సోషల్‌లో ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇంధన రంగంపై దాడులు నిలిపివేసేందుకు అంగీకారం
- ఒప్పందాన్ని ఉల్లంఘించొద్దని ఇరు దేశాలకు సూచన
- కాల్పుల విరమణపై తమకు సమాచారం లేదన్న ఉక్రెయిన్ వర్గాలు
- ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా ఉత్కంఠ

# అట్టుడికిన హస్తిన

ఢిల్లీలో వరుసగా రెండో రోజూ సీజేపీ ఆందోళనలు



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఢిల్లీలో వరుసగా రెండో రోజూ కొనసాగాయి. జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోగా, భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. అరెస్టులు, ఆంక్షలతో ఉద్యమాన్ని అణచలేరని, డిమాండ్ నెరవేరే వరకు రోడ్లపైనే ఉండి పోరాడతామని సీజేపీ నేత అజింక్య శిండే స్పష్టం చేశారు. మరోవైపు, ముంబైలోని శివాజీ పార్కుకు ఆందోళనలను విస్తరించేందుకు సన్నాహాలు జరుగుతుండగా, ఇండియా కూటమి నేతలు కూడా నిరసనలకు సిద్ధమవుతున్నారు. సీజేపీ నేతలతో సమావేశానికి రాహుల్ గాంధీ సమయం కోరినట్లు సమాచారం.

02

- జ్ఞానేశ్ కుమార్ దిగిపోయే వరకు వెనక్కి తగ్గేది లేదు
- రోడ్లపైనే ఉంటాం.. పోరాటం కొనసాగిస్తాం: అజింక్య శిండే
- జంతర్‌మంతర్ వెళ్లేందుకు యత్నించిన విద్యార్థుల అరెస్టు
- భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
- నిరసనకారులపై బలప్రయోగం చేశారని విద్యార్థి సంఘాల ఆరోపణ
- ముంబై శివాజీ పార్కులోనూ ఆందోళనకు పిలుపు
- నేడు మరోసారి నిరసనలకు ఇండియా కూటమి సన్నాహాలు
- సీజేపీ నేతలతో భేటీకి సమయం కోరిన రాహుల్ గాంధీ
- యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలి: రాహుల్

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# విండీస్‌పై భారత్ విక్టరీ

**సిరీస్‌లో 2-1తో ఆధిక్యం.. ఉప్పల్‌లో నాలుగో టీ20**
**-మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం**
**-అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్.. 69 పరుగులతో మెరుపులు**
**-ఇషాన్ కిషన్ దూకుడు.. చివర్లో తిలక్, అక్షర్ కీలక పరుగులు**
**-223 పరుగులకు ఆలౌటైన భారత జట్టు**
**-209 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్**
**-అర్షదీప్ సింగ్ మూడు వికెట్లతో సత్తా**
**-చివర్లో షమర్ స్ప్రింగర్ పోరాటం వృథా**
**-అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20**



వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా అదరగొట్టింది. ఇండోర్ వేదికగా జరిగిన హైస్కోరింగ్ పోరులో 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించిన భారత జట్టు.. బౌలింగ్‌లోనూ కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఈ సిరీస్‌లో నాలుగో టీ20 అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ (69) దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇషాన్ కిషన్ (37) కూడా వేగంగా పరుగులు సాధించడంతో భారత జట్టు భారీ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఒక దశలో 250 పరుగుల మార్కును అందుకునేలా కనిపించిన టీమిండియా.. ఆ తర్వాత వరుస వికెట్లు కోల్పోయి తడబడింది. అయితే చివర్లో తిలక్ వర్మ (28), అక్షర్ పటేల్ (20) కీలక పరుగులు జోడించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. భారీ లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. రెండో ఓవర్లోనే షై హోప్ ఐదు పరుగులు చేసి వెనుదిరిగాడు. అయినప్పటికీ విండీస్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రయత్నించారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెరిగింది. అర్షదీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టి సత్తా చాటగా, నమన్ ధీర్ రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ సాధించారు. చివర్లో షమర్ స్ప్రింగర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత శిబిరంలో కొంత ఉత్కంఠ రేపాడు. కేవలం 11 బంతుల్లోనే 35 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే అప్పటికే లక్ష్యం దూరం కావడంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. గత మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్.. ఈసారి భారత బౌలర్లను అధిగమించలేకపోయింది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజలో నిలిచింది. సిరీస్‌ను కైవసం చేసుకోవాలంటే తదుపరి మ్యాచ్‌లోనూ భారత జట్టు ఇదే జోరు కొనసాగించాల్సి ఉంటుంది. మరోవైపు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో వెస్టిండీస్ బరిలోకి దిగనుంది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20కి హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియం వేదిక కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# రష్యా--ఉక్రెయిన్ మధ్య సీజ్‌ఫైర్!



వాషింగ్టన్:
రష్యా--ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. రష్యా, ఉక్రెయిన్ ఇంధన రంగానికి సంబంధించిన దాడులను నిలిపివేసేందుకు అంగీకరించాయని తెలిపారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ, ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దని ఇరు దేశాలకు సూచించారు. అయితే, ట్రంప్ ప్రకటనపై ఉక్రెయిన్ వర్గాలు స్పందిస్తూ.. కాల్పుల విరమణకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నాయి. దీంతో ఈ ప్రకటన అమలుపై సందిగ్ధత నెలకొంది. ఇరు దేశాల మధ్య నిజంగానే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందా? రష్యా, ఉక్రెయిన్ అధికారికంగా ఎలా స్పందిస్తాయి? అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఏఐ, అణు యుద్ధంతో 2100 నాటికి మానవాళి అంతం!



న్యూఢిల్లీ:
అణు యుద్ధం, కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగం వల్ల మానవాళి మనుగడ భవిష్యత్తులో ప్రమాదంలో పడొచ్చని లాన్సెట్ కొత్త నివేదిక హెచ్చరించింది. ఈ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ 2100 నాటికి వాటి వల్ల మానవాళి తుడిచి పెట్టుకుపోయే అవకాశం ఉందని తెలిపింది. మనుషుల ఆరోగ్యానికి రానున్న 75 ఏండ్లలో ప్రమాదకరంగా మారే 17 అంశాలను నివేదిక పేర్కొంది. వాటిలో ప్రధానంగా అణు యుద్ధం, ఏఐ దుర్వినియోగం, వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం, పిల్లల్లో పోషకాహార లోపం, ఊబకాయం, అంతర్జాతీయ సహాయంలో కోత వంటివి ఉన్నాయి.'ఆరోగ్యానికి 21వ శతాబ్దపు ప్రపంచ ప్రమాదాలపై లాన్సెట్ కమిషన్' పేరిట విడుదలైన నివేదికలో ఈ సమస్యలన్నీ ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నాయని..ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకొని భవిష్యత్తు తరాలను రక్షించవచ్చని నిపుణులు తెలిపారు. జీవాయుధాల సృష్టికి ఏఐని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నదని.. ఈ ఆయుధాలు లక్షలాది మంది జీవితాలను ప్రమాదంలో పడేస్తాయని వారు హెచ్చరించారు. అణు యుద్ధం వల్ల పెద్ద సంఖ్యలో రేణువులు ఉపరితల వాతావరణంలోకి చేరతాయని..అవి సూర్య కాంతిని అడ్డుకొని ఆహారోత్పత్తిని ప్రభావితం చేస్తాయని తెలిపారు. ఇది కరువుకు దారి తీసి మానవాళి మనుగడకు ప్రమాదకరంగా మారొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ఆల్కహాల్ సేవనం, అధిక రక్తపోటు, ఆదాయ అసమానతలు, తక్కువ విద్యా స్థాయిలు, మానసిక ఆరోగ్య క్షీణత, కూడా మానవాళి ఆరోగ్యానికి సవాళ్లు విసురుతాయన్నారు.

# అట్టుడికిన హస్తిన

**-ఢిల్లీలో వరుసగా రెండో రోజూ సీజేపీ ఆందోళనలు**
**-జ్ఞానేశ్ కుమార్ దిగిపోయే వరకు వెనక్కి తగ్గేది లేదు**
**రోడ్లపైనే ఉంటాం.. పోరాటం కొనసాగిస్తాం: అజింక్య శిండే**
**-జంతర్‌మంతర్ వెళ్లేందుకు యత్నించిన విద్యార్థుల అరెస్టు**
**-భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు**
**-నిరసనకారులపై బలప్రయోగం చేశారని విద్యార్థి సంఘాల ఆరోపణ**
**-ముంబై శివాజీ పార్కులోనూ ఆందోళనకు పిలుపు**
**-నేడు మరోసారి నిరసనలకు ఇండియా కూటమి సన్నాహాలు**
**-సీజేపీ నేతలతో భేటీకి సమయం కోరిన రాహుల్ గాంధీ**
**-యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలి: రాహుల్**

**న్యూఢిల్లీ**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో సీజేపీ నిరసనలు రెండో రోజూ కొనసాగాయి. జాతీయ రాజధానిలో పలుచోట్ల ఆందోళనలు జరగడంతో పోలీసులు, పారామిలిటరీ బలగాలను భారీగా మోహరించారు. నిరసనకారులను నియంత్రించేందుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. గత రెండు రోజులుగా వేలాది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. దాదాపు 24 గంటల నిర్బంధం అనంతరం అభిజిత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను ఆదివారం ఉదయం విడుదల చేసినట్లు సమాచారం. సీజేపీ నాయకుడు అజింక్య శిండే మాట్లాడుతూ.. తమ డిమాండ్ నెరవేరే వరకు రోడ్లపైనే ఉండి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాయకుల అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం భావిస్తోందని, అయితే తాము వెనక్కి తగ్గబోమని ప్రకటించారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని అశుతోష్ రాంకా వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా



చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని నాయకులు స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆందోళనల సందర్భంగా జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, పలువురు విద్యార్థులను నిర్బంధించినట్లు సమాచారం. పోలీసుల దాడిలో తమ నాయకులు గాయపడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకుంటున్నారని సీజేపీ నాయకులు విమర్శించారు. ఢిల్లీలో అత్యవసర పరిస్థితిని తలపించేలా ఆంక్షలు విధించారని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, నిరసనకారులపై పోలీసుల బలప్రయోగం వంటి అంశాలపైనా సీజేపీ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. తమ ఫోన్లను హ్యాక్ చేశారని లేదా పనిచేయకుండా చేశారని, సాక్ష్యాలను కావాలనే సృష్టించారనే అనుమానాలు ఉన్నాయని సౌరవ్ దాస్ పేర్కొన్నారు. సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని, యువత శాంతియుతంగా నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరోవైపు, నిరసనకారులు తిరిగి జంతర్‌మంతర్‌కు చేరుకునేందుకు ప్రయత్నిస్తారని అజింక్య శిండే ప్రకటించారు. అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్టులతో ఉద్యమం ఆగిపోతుందని ప్రభుత్వం భావించినా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షురాలు నేహా బోరా కూడా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిరసనలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో మెట్రో, రైలు సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అన్ని మెట్రో స్టేషన్లను ఆదివారం తిరిగి తెరిచినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తెలిపింది. రైలు సేవలపై ఆంక్షలు శనివారం వరకే వర్తిస్తాయని నార్తర్న్ రైల్వే అధికారులు వెల్లడించారు. అయితే ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి 30 ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించారు. ఢిల్లీకి పరిమితం కాకుండా ఉద్యమాన్ని ఇతర ప్రాంతాలకూ విస్తరించాలని సీజేపీ నాయకులు భావిస్తున్నారు. ముంబైలోని శివాజీ పార్కులో నిరసన నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. మరోవైపు, ఇండియా కూటమి నేతలు కూడా సోమవారం మరోసారి ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సీజేపీ నాయకులతో సమావేశమయ్యేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమయం కోరినట్లు కథనం పేర్కొంది. యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో కొనసాగుతున్న ఈ నిరసనలు రానున్న రోజుల్లో మరింత ఉధృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం!

ఖాట్మండు
నేపాల్‌లో మరోసారి ప్రకృతి ప్రకోపం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గోర్ఖా జిల్లాలోని చుమ్నుబ్రి ప్రాంతంలో బుది గండకీ నది ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సంభవించిన ఈ విపత్తు ధాటికి పదుల సంఖ్యలో ఇళ్లు, పలు వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నది. రెండు నెలల క్రితం ఎదురైన వరద విషాదం నుంచి తేరుకోకముందే మరోసారి వరదలు విరుచుకుపడటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. నది ప్రవాహం అనూహ్యంగా పెరగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం 3.66 మీటర్లుగా ఉన్న నీటిమట్టం కేవలం రెండు గంటల్లోనే 8.43 మీటర్లకు చేరింది. ప్రమాద సూచిక అయిన ఐదు మీటర్ల స్థాయిని దాటడంతో వరద తీవ్రత పెరిగింది. ఇసుక, బురదతో కూడిన వరద నీరు వేగంగా ప్రవహిస్తూ ఇళ్లు, వంతెనలను ధ్వంసం చేసింది. జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) ప్రాథమిక



సమాచారం ప్రకారం 34 ఇళ్లు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోగా, జలవిద్యుత్ కేంద్రానికి భారీ నష్టం వాటిల్లింది. శాటిలైట్ చిత్రాలు, ప్రాథమిక సమాచారం ఆధారంగా బుది గండకీ నది ప్రవాహానికి ఏదో విధంగా ఆటంకం ఏర్పడి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో నీరు ఒక్కసారిగా ఉప్పొంగి వరదలకు కారణమై ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, అసలు కారణాలను నిర్ధారించేందుకు సాంకేతిక విశ్లేషణ అవసరమని స్పష్టం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. మరోవైపు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ సైన్యం సహాయక చర్యలను ప్రారంభించింది. అత్యవసర వైద్య బృందాన్ని రాజధాని నుంచి హెలికాప్టర్‌లో తరలించింది. బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టింది. నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గత ఆగస్టులో టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన వరదలు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చినట్లు కథనం పేర్కొంది. ఆ విషాదం నుంచి కోలుకుంటున్న నేపాల్‌లో తాజాగా మరోసారి వరదలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. పర్వత ప్రాంతాల్లో ఆకస్మికంగా పెరుగుతున్న నదీ ప్రవాహాలు, వరద ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

# డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా గోవా

డ్రగ్స్ నియంత్రణలో బీజేపీ విఫలం (మొదటి తరువాయి)
బీజేపీ పాలనలో గోవా డ్రగ్స్ కేంద్రంగా మారిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న డ్రగ్స్ గోవా నుంచే వస్తున్నట్లు తెలంగాణ పోలీసులు గుర్తించారని పేర్కొన్నారు. దేశాన్ని మత్తు పదార్థాల రొంపిలోకి మారుస్తున్న చెబుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి గోవాలో డ్రగ్స్ సమస్యను ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రశ్నించారు. డ్రగ్స్ పెడ్లర్లు, భూకబ్జాదారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను ఉద్దేశించి 'ప్రాపర్టీ సావంత్' అంటూ విమర్శించారు. రాష్ట్ర భూములు, ప్రభుత్వ ఆస్తులు ఇతరుల చేతుల్లోకి వెళుతున్నాయని ఆరోపించారు. గోవా ప్రజలు మరోసారి బీజేపీని నమ్మి మోసపోవద్దని, ఆ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు.
ఓట్ల జాబితాలపై ఆరోపణలు
దేశవ్యాప్తంగా ఓట్ల జాబితాల నుంచి పేదలు, దళితులు, మైనార్టీలు, ఆదివాసీల ఓట్లను తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల బ్యబస్థను ఉపయోగించుకుని ప్రతిపక్షాల ఓటు బలాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరాటాన్ని రాముడు, రావణుడి యుద్ధంతో పోల్చిన ఆయన.. దేశంలో ఐక్యత, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాడుతోందని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర లక్ష్యం ప్రజలను ఏకం చేయడమేనని చెప్పారు.
2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం: సీఎం
2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గోవా ప్రజల భూములు, హక్కులు, యువత భవిష్యత్తును కాపాడేందుకు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. డ్రగ్స్ సమస్యను నియంత్రించి, భూకబ్జాలను అరికట్టి మెరుగైన పాలన అందించాలంటే బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు.
'గోయ్ రాథోన్స్' యాత్రలో పాల్గొన్న రేవంత్
గోవా కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'గోయ్ రాథోన్స్' యాత్రలోనూ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పనాజీలోని చీఫ్స్ స్మారకం నుంచి కున్సేలిమ్ బస్టాండ్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గోవా భూములు, సహజ వనరులు, ప్రజల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీకి మద్దతు కూడగట్టడంపై నాయకత్వం దృష్టి సారించింది.

# సిరిసిల్ల జేఎన్‌టీయూ సమస్యలను పరిష్కరించండి!

(మొదటి తరువాయి)

తెలిపారు. అయినప్పటికీ నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో కళాశాల అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాల కొనసాగుతున్న ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగంగా మారకుండా చూడాలని సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అంతరాయం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కొత్త క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంగణంలోనే నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలక పాత్ర పోషిస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్యాంపస్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు, ప్రస్తుత ప్రాంగణంలోనే కళాశాల కొనసాగించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు

# రైతులు రెండో పంటతో నష్టపోవద్దు

(మొదటి తరువాయి)

శంకుస్థాపన చేశారు. మంగలితండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే.. హటియాథాండాలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బడ?త్ వీరన్న తండ్రి భాషా కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల శ్రీకార సభలో మంత్రి ప్రసంగించారు. గతంలో యూనిట్ విద్యుత్తు రూ. 7, రూ. 8కు లభించడాని, ప్రస్తుతం విద్యుత్తు కొరత తీవ్రంగా ఉందని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. యూనిట్‌కు రూ. 15 చెల్లించి కొనుగోలు చేసాలన్నా దేశంలో విద్యుత్తు లభించని పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే పదిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
రెండో పంట సాగు వద్దు..
ఎల్నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రైతులు రెండో పంట సాగు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు. ఎల్నినో ప్రభావం దక్షిణ ప్రాంతాలపై తీవ్రంగా ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, జీ రామ్ జే పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని అభ్యర్థించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర.టీఎస్, కాంగ్రెస్ మండలధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. హఫీజ్‌ద్దీన్, జాకూరి గోపాలరావు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సిద్దిపేట గడ్డ నుంచే మళ్లీ ఉద్యమం!

1983లోనే సిద్దిపేటను జిల్లాగా ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు దరఖాస్తు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2016 అక్టోబర్ 11న జిల్లా ఏర్పాటైందన్నారు. గతంలో విద్యుత్ కనెక్షన్లు, ఇతర ప్రభుత్వ పనుల కోసం రైతులు సంగారెడ్డికి వెళ్లాల్సి వచ్చేదని, జిల్లా ఏర్పాటు తర్వాత ఆ ఇబ్బందులు తగ్గాయని పేర్కొన్నారు. అనంతగిరి, గౌరవెల్లి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులతో సాగునీటి సదుపాయాలు మెరుగుపడ్డాయని తెలిపారు. 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, వైద్య కళాశాల, ఐటీ టవర్ వంటి సదుపాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లకుండా నిలిపివేస్తోందని విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీరు ఉన్నప్పటికీ కాళేశ్వరం, కల్వకుర్తి, దేవాదుల ప్రాజెక్టుల మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. రంగనాయక సాగర్‌ను పూర్తిగా నింపకపోవడంతో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాల్లో పంటలకు నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. దేవాదుల మోటార్లను ఎనిమిది గంటలే నడుపుతున్నారని, కల్వకుర్తి ప్రాజెక్టు వద్ద కూడా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. బొగ్గు నిల్వలు, విద్యుత్ ఉత్పత్తి నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపిస్తూ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

# నర్వలో విజయవంతంగా బీజేపీ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

**●మక్తల్ నియోజకవర్గంలో 10 వేల మంది పట్టభద్రుల నమోదు లక్ష్యం**

**●ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి**

**నర్వ, అక్టోబర్ 11 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు టి. అజిత్ సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మక్తల్ నియోజకవర్గంలో 10 వేల మంది అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి బీజేపీ మండల అధ్యక్షుడు, బూత్ అధ్యక్షుడు, పార్టీ పదాధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అర్హులైన పట్టభద్రులందరినీ నమోదు చేయించాలని సూచించారు. నారాయణపేట జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బలరాంరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న నాయకులు: ఎమ్మెల్సీ ఎన్నికల సహ ఇంచార్జీలు జయానంద్ రెడ్డి, జిందే జ్యోతి శ్రీనివాస్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేట లలితా వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కనకరాజు, జిల్లా టెలికాం మెంబర్ పసుల నీరజ్, మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప, ప్రతాప్ రెడ్డి, మంగా లావణ్య, మల్లారెడ్డి, మండ్ల సురేష్, అశోక్ భూపాల్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సాకలి బొజ్జన్న, మల్లేష్, మైనారిటీ మోర్చా నాయకుడు జావీద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్సీ ఇంచార్జ్ డాక్టర్ బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి

# వెల్జాల్‌లో వైభవంగా రెండో రోజు అటుకుల బతుకమ్మ సంబరాలు



**తలకొండపల్లి, అక్టోబర్ 11 (నేటి దర్శని):**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో రెండో రోజు అటుకుల బతుకమ్మ వేడుకలను మహిళలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా నిర్వహించారు. గునుగు, తంగేడు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, అటుకులు, బెల్లంతో తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించి బతుకమ్మను భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో ప్రశాంతి, శోభా, తులసి, మౌనిక, లలితమ్మ, శివలీల, వరలక్ష్మి, సరస్వతి, కల్పన, భవాని, యాదమ్మ, వనజ, హైమావతి, పద్మలక్ష్మి తదితర గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజు భక్తులకు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు





**ఆమనగల్లు, అక్టోబర్ 11 (నేటి దర్శిని):**
రాజరాజేశ్వరి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆమనగల్లులోని భక్త మార్కండేయ దేవాలయంలో పూజాది కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీ విజ్ఞయ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి జయ జయ ద్వానాల మధ్య భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభనుసంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ నిర్వహించారు. దేవాలయాన్ని, దేవాలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా, పచ్చటి తోరణాలతో,కాషాయపు జెండాలతో ముస్తాబు చేశారు. దేవాలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు సకల ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భక్త మార్కండేయ దేవస్థాన కమిటీ, పద్మశాలి యువజన సంఘం, పద్మశాలి మహిళా సంఘం, ఉత్సవ కమిటీనిర్వాహకులు,భక్తులు,మహిళలు, కుల బాంధవులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్

**●ఈనెల 13 ఆమనగల్లు లో ఉద్యోగ డ్రైవ్ తెలంగాణ రాష్ట్ర టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**ఆమనగల్లు, అక్టోబర్ 11 (నేటి దర్శిని):**
నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.ఇందులో భాగంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో 25వ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆదివారం ఆయన తెలిపారు.కల్వకుర్తి నియోజకవర్గం లోని ఆమనగల్లు,కడ్తాల్, తలకొండపల్లి, మాడుగుల, వెల్దండ,కల్వకుర్తి, చారకొండ మండలాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఈ నెల 13న ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఉద్యోగ ఎంపికల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.ఈ జాబ్ డ్రైవ్‌లో 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల అర్హులైన యువతీ, యువకులు పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ పరిశ్రమలతో పాటు ఇతర కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసే అవకాశం ఉందని తెలిపారు.ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలతో పాటు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత భోజనం,వసతి వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ముఖ్యంగా మహిళలకు అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఆధార్ కార్డు,పాన్ కార్డు,పదో తరగతి, ఇంటర్మీడియట్,ఐటీఐ, డిప్లొమా,డిగ్రీ తదితర విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు. వీటితో పాటు బ్యాంకు పాస్‌బుక్,రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, అవసరమైన అన్ని ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో కూడిన ఒక సెట్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఉద్యోగం పొందాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. యువతలో నిరుద్యోగ సమస్యను తగ్గించి, అర్హతకు తగిన ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ వరుసగా జాబ్ డ్రైవ్‌లు నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పలు ఉద్యోగ మేళాల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేసిన ఫౌండేషన్, ఇప్పుడు 25వ జాబ్ డ్రైవ్‌ను నిర్వహించేందుకు సిద్ధమైందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఐక్యత ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ ఆమనగల్ మండల ఇన్చార్జ్ రచ్చ శ్రీరాములు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

**●మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్**



**ఆమనగల్లు, అక్టోబర్11 (నేటి దర్శిని):**
ఆమనగల్లు రైతు వేదికలో నేటి ఉదయం 11 గంటలకు సీఎంతో"రైతు నేస్తం" ముఖాముఖిగా మాట్లాడే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఏవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని రైతులతో సీఎం ముఖాముఖిగా మాట్లాడుతారని ఆయన వివరించారు. వర్షాభావ పరిస్థితులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ ఫామ్, పాల ఉత్పత్తి రైతులు, ప్రజాప్రతినిధులు వీక్షించేందుకు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# చింతపల్లి సాయిసన్నిధిలో నిర్మల్ అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు

**●ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనంజయ ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**●సాయిబాబాను దర్శించుకున్న బి. వెంకటేశ్వర్లు.. భక్తిశ్రద్ధలతో పూజలు, హారతి**





**చింతపల్లి, అక్టోబర్ 11 (నేటి దర్శిని):**
చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా సన్నిధిని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనంజయ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు భగవంతరావుతో కలిసి అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను సమర్పించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని సాయిబాబాను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

**ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించిన కమిటీ**

దర్శనం అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనంజయ, కమిటీ ప్రతినిధులు అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి, సాయిబాబా జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యం, భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమాలు, ఆలయ నిర్వహణకు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు. భక్తులకు ఆధ్యాత్మిక సేవలందించడంతో పాటు అన్నదాన కార్యక్రమాల ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రియాద్ ఎయిర్‌పోర్టుపై దాడిని తీవ్రంగా ఖండించిన భారత్..!

**న్యూఢిల్లీ అక్టోబర్ 11, ( నేటి దర్శిని )**
సౌదీఅరేబియా రాజధాని నగరం రియాద్ లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు పై జరిగిన క్షిపణి దాడి ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోవడమేగాక 300 మందికిపైగా గాయపడటంపట్ల విచారం వ్యక్తంచేసింది. పౌరులను లక్ష్యంగా చేసుకుని, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని జరిపే ఇలాంటి దాడులు మళ్లీమళ్లీ పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది.గత దశాబ్ద కాలంలో సౌదీగడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా తాజా దాడిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం



కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతోపాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. 'పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి' అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని విదేశాంగశాఖ తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం.

# ఇంటర్నెట్ ఆపొద్దు.. మెట్రో రైళ్లు నడపండి.

### సీజేపీ నిరసనల వేళ కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

**న్యూఢిల్లీ అక్టోబర్ 11, ( నేటి దర్శిని )**
సీజేపీ నిరసనల వేళ ఢిల్లీలో పోలీసులు కఠినమైన ఆంక్షల్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు స్పందించింది. బారికేడ్లు తొలగించాలని, ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని, మెట్రో రైళ్ల యథాతథంగా నడపాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు ఆదివారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో శనివారం పోలీసులు భారీ ఆంక్షలు విధించారు. నిరసన జరిగే జంతర్ మంతర్‌తోపాటు అనేక చోట్ల బారికేడ్లు



ఏర్పాటు చేశారు. ఢిల్లీ పరిధిలోని 50కిపైగా మెట్రో రైలు స్టేషన్లను మూసేసి, రైలు సర్వీసుల్ని నిలిపివేశారు. ఇంటర్నెట్ సేవల్ని రద్దు చేశారు. దీంతో ఢిల్లీలో ఒక నిర్బంధ, ఎమర్జెన్సీ వాతావరణం తలపిస్తోంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పందించింది. జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని ధర్మాసనం ఆదివారం అత్యవసరంగా విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో ప్రజా జీవితం సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని, మెట్రో రైళ్లు ప్రారంభించాలని, బారికేడ్లు తొలగించాలని సూచించింది. ప్రజలను అనవసరంగా, ప్రతి చోటా తనిఖీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. సీజేపీ నిరసన సందర్భంగా అత్యవసరమని భావిస్తే తప్ప ఈ ఆంక్షలు విధించకూడదని సూచించింది. శాంతి భద్రతలకు నిజంగా విఘాతం కలుగుతుందని భావించినప్పుడే ఈ ఆంక్షలు అమలు చేయాలని వివరించింది. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు, కేంద్ర హోం శాఖ సెక్రెటరీ, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ తీర్పు వెలువడటానికి ముందే సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే సహా కీలక నేతల్ని విడుదల చేయాలని మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించి

# పాకిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎమర్జెన్సీ..

**న్యూఢిల్లీ అక్టోబర్ 11, ( నేటి దర్శిని )**
పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అనే మాటలకు పెద్దగా విలువుండదు. అక్కడా అంతా నియంతృత్వమే. ఎవరు అధికారంలో ఉంటే వారిదే పెత్తనం. ఇందుకు తాజా పరిణామాలే ఉదాహరణ. పాకిస్తాన్‌లోని కీలక ప్రాంతమైన ఖైబర్ పఖ్తుంఖ్వాలో అక్కడి సమాఖ్య ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. అక్కడ అధికారంలో ఉన్న పీటీఐ (పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్) ప్రభుత్వాన్ని రద్దు చేసింది. రాష్ట్ర సీఎం సోహైల్ అఫ్రిదితోపాటు ఆరుగురు క్యాబినెట్ మంత్రుల్ని అరెస్టు చేసింది.పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆధ్వర్యంలోని సమాఖ్య ప్రభుత్వం దీనిపై ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ రద్దు, ఎమర్జెన్సీ, సీఎం, మంత్రుల అరెస్టు కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234ను ప్రభుత్వం ఉపయోగించింది. ఈ నిర్ణయానికి రాష్ట్రపతి అసిఫ్ అలీ జర్దారీ అంగీకారం తెలిపారు. పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం జైలులో ఉన్న సంగతి



తెలిసిందే. ఆయనను షరీఫ్ ప్రభుత్వం అరెస్టు చేసి, జైలు నుంచి విడుదల కాకుండా చూస్తోంది. దీంతో ఆయన మద్దతుదారులు ఇటీవల ఆందోళన నిర్వహించారు. దీనిలో భాగంగా ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం అఫ్రిది ఈ నెల 4న ర్యాలీ నిర్వహించారు. ఇమ్రాన్‌ను విడుదల చేయాలని కోరుతూ ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ర్యాలీ నిర్వహించి ఇబ్బంది కలిగించినందుకుగాను షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించింది. దీంతో ఇప్పుడు అక్కడ శాంతి భద్రతలు, పాలన సహా మొత్తం అధికారం స్థానిక గవర్నర్ పరిధిలో ఉంటుంది. ఈ అంశంపై సీఎం సోహైల్ అఫ్రిది స్పందించారు. తమ ప్రభుత్వాన్ని రద్దు చేసినా, గవర్నర్ పాలన విధించినా తమ డిమాండ్ల విషయంలో వెనుకడుగు వేయబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమాఖ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై . ఖైబర్ పఖ్తుంఖ్వా పరిధిలోని ప్రజలు, మద్దతుదారులు భారీ ఎత్తున నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా . ఖైబర్ పఖ్తుంఖ్వా రాజధాని పెషావర్‌లో రోడ్లపై భారీ షిప్పింగ్ కంటైనర్లను అడ్డుగా పెట్టారు. నగరవ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఇస్లామాబాద్‌లోని ప్రధాని నివాసం వద్ద కూడా గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

# పోరాటం ఇప్పుడే మొదలైంది..

- -జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకూ వెనక్కి తగ్గబోం
- -దేశ రాజధానిలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు
- -సీఈసీని కాపాడేందుకు సొంత ప్రజలపైనే యుద్ధమా?
- -కేంద్ర సర్కార్‌పై సీజేపీ ఫైర్

**న్యూఢిల్లీ అక్టోబర్ 11, ( నేటి దర్శిని )**
: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలను దేశవ్యాప్తం చేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేతలు ప్రకటించారు. ఢిల్లీ పోలీసుల నిర్బంధం నుంచి విడుదలైన అనంతరం సీజేపీ సహ కన్వీనర్ ఆశుతోష్ రాంకా, మరో నేత సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ, తమ పోరాటం ఇప్పుడే మొదలైందని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంత వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయని, ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని సీజేపీ ఆరోపించింది. ప్రధాని మోదీ ప్రభుత్వం ఢిల్లీలో అత్యవసర పరిస్థితులను తలపించే వాతావరణాన్ని సృష్టించిందని దాస్ విమర్శించారుఎలాంటి అధికారిక నోటీసు లేకుండా




తమను నిర్బంధించారని, తమ ఫోన్లు స్వాధీనం చేసుకుని, న్యాయవాదిని సంప్రదించేందుకు అనుమతించలేదని ఆరోపించారు. తమ ఫోన్లను హ్యాక్ చేసి, వాటిలో పత్రాలు లేదా ఇతర సమాచారాన్ని చొప్పించి, తర్వాత వాటిని సాక్ష్యాలుగా చూపిస్తారేమోనని అనుమానంగా ఉందని దాస్ పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, అమిత్ షా ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. 'గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, షా ప్రయత్నిస్తున్నారు. ఆయన్ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే యుద్ధం చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. 'శాంతి భద్రతలకు ఏడాది పాటు విఘాతం కలిగించకూడదని తమకు షరతు విధించారు. అయితే శాంతిభద్రతలకు విఘా తం కలిగిస్తున్నది నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లేనని సీజేపీ నేతలు పేర్కొన్నారు. గత 72 గంటల్లో జరిగిన పరిణామాలు 1975–77 నాటి అత్యవసర పరిస్థితులను గుర్తుచేస్తున్నాయని రాంకా వ్యాఖ్యానించారు. ఈ పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని, నిరసనల్లో పాల్గొనేందుకు వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం పార్లమెంట్ వీధి పోలీసులను కలిసి జంతర్ మంతర్‌లో శాంతియుత నిరసన తెలిపేందుకు ఒక తేదీని అనుమతించాలని కోరతా మన్నారు.

## సంపాదకీయం

# మరో పోరుకు నాంది పలుకుదాం



**దీంతో అభివృద్ధి, సంక్షేమం పర్యవేక్షణలో ఇబ్బందులు ఏర్పడేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో ప్రజల ముంగిట పాలన ఉండాలని నిర్ణయం తీసుకుని పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 10 ఉమ్మడి జిల్లాలను 33 జిల్లాలుగా విభజించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా రూ.3.50 కోట్ల, పరిపాలనా సౌలభ్యంతోపాటు, అభివృద్ధి, సంక్షేమం, నిరంతర పర్యవేక్షణ కోసం ప్రభుత్వం కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు చేయడం పరిపాలనా విప్లవం.**

లంగాణలో జిల్లాల సంఖ్య పెంచడం ద్వారా అదనంగా కేంద్ర ప్రభుత్వం నుంచి విద్యా సంస్థలు, ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు వీలవుతుంది. ప్రజల ముంగిట పాలన ఉంటే పారదర్శక పరిపాలన సాధ్యమవుతుందని విశ్వసించి కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల ఫలితాలు స్పష్టంగా కనిపించాయి. జిల్లాల ఏర్పాటు తర్వాత తీసుకున్న మరో గొప్ప నిర్ణయం జోనల్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న రెండు జోన్‌లను ఏడు జోన్‌లుగా, 2 మల్టీజోన్లుగా విభజించి గతంలో ఉన్న రిజర్వేషన్ పద్ధతిని తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్చారు. దేశంలోనే తొలిసారిగా స్థానిక రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో ఉన్న 85%, 70%, శాతం రిజర్వేషన్లు 95% శాతం తెలంగాణ ప్రజలకు దక్కేవిధంగా రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆమోదం తీసుకురావడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమైంది. జిల్లా స్థాయి పోస్టుల్లో జిల్లా యువకులకు దక్కే అవకాశం వచ్చింది. గ్రూప్–1 ఉద్యోగాలు కూడా స్థానికులకు దక్కే అవకాశాలు ఎక్కువగా వచ్చాయి. జిల్లా కేంద్రాల్లో కార్యాలయాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్, మండలాలు ఏర్పాటు వలన ప్రజలకు పరిపాలన అందుబాటులోకి రావడం రాష్ట్ర ఏర్పాటుతోనే సాధ్యమైంది. కొత్తగా 153 మండలాలు, 35 రెవెన్యూ డివిజన్లు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, 4,914 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. పరిపాలన సంస్కరణలు తెలంగాణ సత్వర అభివృద్ధికి గొప్ప చోదకశక్తిగా మారాయి. 'సంపద పెంచుదాం.. ప్రజలకు పంచుదాం' అనే నినాదంతో కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం స్వర్ణయుగాన్ని ఆవిష్కరించింది. 2014లో తలసరి ఆదాయం రూ.1,24,104 నుంచి రూ.3,17,115 లకు పెరిగింది. రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ రూ.5,05,848 నుంచి రూ.12,93,469 కోట్లకు పెరుగడం పరిపాలనా సంస్కరణల ఫలితం. విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి జూన్ 23 వరకు 19,464 మెగావాట్లకు పెరిగింది. తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్ల నుంచి 2,140 యూనిట్లకు పెరిగింది. నిరంతర విద్యుత్తు కోసం రూ.1,37,517 కోట్లు ఖర్చు చేసింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, కాకతీయ మిషన్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.68 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 350 లక్షల టన్నులకు పెరిగింది. విద్యారంగంలో 1,022 గురుకులాల ఏర్పాటు, 1,005 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, 85 గురుకుల డిగ్రీ కాలేజీలు, 29 మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. ఎంబీబీఎస్ సీట్లు మూడు రెట్లు పెరిగాయి. వైద్య రంగంలో మౌలిక వసతులు కల్పించి బెడ్స్ 17 వేల నుంచి 34 వేలకు, ఐసీయూ 5 నుంచి 80, బస్తీ దవాఖానాలు 500, డయాలసిస్ కేంద్రాలు 3 నుంచి 82 వరకు పెంపుతోపాటు హైదరాబాద్ నలువైపులా టిమ్స్ నిర్మాణం, నిమ్స్ విస్తరణ, లాంటి చర్యల వలన ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధితో పాటు సంక్షేమం జోడెద్దుల లాగా పాలన సాగింది. అన్నిరంగాల్లో తెలంగాణ దేశంలోనే రోల్‌మాడల్‌గా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డులు ఎక్కువగా దక్కించుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలువడం గర్వకారణం. ప్రజల సంక్షేమం, పరిపాలన రాష్ట్ర ప్రగతికి మాత్రమే కాదు.. దేశాభివృద్ధిలో భాగంగా భావించి పరిపాలన వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టడం ద్వారా ప్రజలకు ఫలితాలు స్పష్టంగా కనిపించాయి. జిల్లా స్థాయి కార్యాలయాలు ప్రజలకు చేరువయ్యాయి. సమస్యలకు సులభంగా పరిష్కారాలు కనుగొనేందుకు వీలుకలిగింది. నగరాలు అభివృద్ధి చెందాయి. శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తమ సర్వీస్ సమస్యల కోసం నిత్యం డీఈవో, కలెక్టర్‌లను కలిసే అవకాశం రావడం, చిన్నతరహా ఉద్యోగులకు స్వంత జిల్లాలో పనిచేసే అవకాశం కలిగింది. జిల్లా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమై పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించింది. జిల్లాల ఏర్పాటు సత్వర అభివృద్ధికి, పారదర్శక పాలనకు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి రావడం పరిపాలనా సౌలభ్యమనే విషయాన్ని ప్రజలు గుర్తించారు. భవిష్యత్తు తరాలకు మేలు చేసేలా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికీ జనం హర్షిస్తున్నారు. జిల్లాలు ఏర్పాటు జరిగి పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చారిత్రక నిర్ణయాన్ని హర్షిస్తూ అన్ని జిల్లాల్లో నేడు, రేపు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపడంతోపాటు, నాటి వికాసాన్ని ప్రజలకు వివరించాలి. స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి, తెలంగాణ పునర్నిర్మాణానికి సారథ్యం వహించి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుందాం. దాదాపు మూడేండ్ల కాంగ్రెస్ దుష్టపాలనను ఎండగట్టి, బీఆర్ఎస్ అండగా ఉంటుందనే ప్రజలకు భరోసా ఇద్దాం.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుడుదాం.

# కేంద్రంలోని మోదీ సర్కార్ కు పతనం తప్పదు

**● డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత**



**ఆమనగల్లు, అక్టోబర్11 (నేటి దర్శిని):** ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, రాజ్యాంగం మీదదాడి చేస్తున్నా కేంద్రంలోని మోదీ సర్కార్ కు పతనం తప్పదని డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వ ఓట్ల చోరీ పై ప్రజా తిరుగుబాటు మొదలు కావడంతో తట్టుకోలేక నిర్బంధ కాండ కొనసాగిస్తుందని ఆమె మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం పారిజాత నర్సింహారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... సర్ ను రద్దు చేసి సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనా చేయాలనే డిమాండ్ తో సోమవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ నేతృత్వంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ప్రతి భారతీయుడు కలిసి రావాలని కోరారు. మహా ధర్నాకు జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు అంతా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సర్ లో అక్రమాలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలపై ప్రజా తిరుగుబాటును గ్రహించిన మోడీ సర్కారు అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపుతుందని పారిజాత నరసింహారెడ్డి మండిపడ్డారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి సర్ ను రద్దు చేసే వరకు ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తుందని ఆమె ఉద్ఘాటించారు. ఓట్ల చోరీ ద్వారా మోడీ సర్కారు దేశంలో ఆధిపత్యం, అధికారం కొనసాగిస్తుందని ఆరోపించారు. దేశంలోని యువత కేంద్రంలోని మోడీ సర్కారు అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై తిరుగుబాటు చేసి అడ్డుకట్ట వేయాలని కోరారు.

## దేశ అభివృద్ధిని అడ్డుకునేందుకు కాంగ్రెస్, మిత్రపక్షాల కుట్రలు

**● జాతీయ ఓబిసి మాజీ సభ్యులు తల్లోజు ఆచారి**



**ఆమనగల్లు, అక్టోబర్ 11 (నేటి దర్శిని):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ దేశాలలో సత్సం బంధాలను కొనసాగిస్తూ, శాంతి, సుస్థిరత, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కల్వకుర్తి నియోజకవర్గ బిజెపి సీనియర్ నాయకులు, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న సమయంలో, కాంగ్రెస్ పార్టీ మరియు దాని మిత్రపక్షాలు"ఓట్ చోరీ"అనే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ, పత్రికలు, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆచారి విమర్శించారు. దేశ ప్రతిష్టను, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని, ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిష్టను దెబ్బతీసేలా ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తల్లోజు ఆచారి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న అల్లూరి కిట్టుకు రూ.17 వేల ఆర్థిక సాయం

**● అందించిన స్వచ్ఛంద సేవకుడు జరుపుల భాస్కర్ నాయక్**



**మిడ్జిల్, అక్టోబర్ 11 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** జడ్చర్ల నియోజకవర్గంలోని 26వ వార్డుకు చెందిన అల్లూరి కిట్టు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సేవకుడు జరుపుల భాస్కర్ నాయక్ వెంటనే స్పందించారు. వై. జయరాజ్ ఈ విషయాన్ని జరుపుల భాస్కర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన వెంటనే 26వ వార్డులోని అల్లూరి కిట్టు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిట్టు కనీస అవసరాల నిమిత్తం రూ.17,000 ఆర్థిక సహాయం అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆపద సమయంలో అండగా నిలుస్తూ, తన వంతు సహాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## మండ్ల యాదగిరి కుటుంబానికి పరామర్శ

**● పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**



**మిడ్జిల్, అక్టోబర్ 11,(నేటి దర్శిని):** ఊరుకొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన మండ్ల యాదగిరి దశదినకర్మ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ శిరిడిగా చింతపల్లి.. సాయినాథుని 108వ పుణ్యతిథి ఉత్సవాలు!

**● నేటి నుంచి 22 వరకు శరన్నవరాత్రి ఆధ్యాత్మిక శోభ**
**● విజయదశమి రోజున 108 కలశాలతో అభిషేకం.. 22న గరికపాటి నరసింహారావు ప్రవచనం**
**● భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు**





**చింతపల్లి, అక్టోబర్ 11 (నేటి దర్శిని):** సాయినామ స్మరణతో చింతపల్లి ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. రెండవ శిరిడిగా పేరుగాంచిన చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిరిడీ సాయినాథుని ఆలయంలో 108వ పుణ్యతిథి ఉత్సవాలు, శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హరికథలు, భజన సంకీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేయనున్నాయి. విజయదశమి రోజున 108 కలశాలతో అభిషేకం, 22న పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

**సాయినాథుని సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి**

సర్వమత సమానత్వానికి ప్రతీకగా నిలిచిన సాయినాథుడు 'సబ్ కా మాలిక్ ఏక్ హై' అనే సందేశంతో భక్తుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. బాబా దివ్యదర్శనం, నామస్మరణతో మనశ్శాంతి లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో సాయినాథుని పుణ్యతిథి ఉత్సవాలతో పాటు శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. ఆలయాన్ని సుందరంగా అలంకరించి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది.

**రోజుకో ఆధ్యాత్మిక కార్యక్రమం**

ఈ నెల 11న శానకొండ శివ కిరణ్ శర్మ నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించనున్నారు. 12న జల్దా జయరాములు ఆధ్వర్యంలో గజేంద్రమోక్షం హరికథ, 13న వావిలాల నాగమణి ఆధ్వర్యంలో శివలీలల హరికథ నిర్వహించనున్నారు. 14, 19 తేదీల్లో భజన సంకీర్తనలు జరగనున్నాయి.
15న సినీనటి కరాటే కళ్యాణి శ్రీ వల్లీ కళ్యాణాన్ని హరికథ రూపంలో ప్రదర్శించనున్నారు. 16న కుమారి వెంకటి నాగ సింధు ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం, 17న బంగారు లక్ష్మి ఆధ్వర్యంలో శ్రీ పార్వతీ కళ్యాణం, 18న జల్దా జయరాములు ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణీ కళ్యాణం హరికథా కాలక్షేపాలు నిర్వహించనున్నారు.

**విజయదశమి రోజున విశేష అభిషేకం**

ఈ నెల 20న విజయదశమి సందర్భంగా సాయినాథునికి 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో పాలపిట్ట దర్శనం అనంతరం శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. 21న పూర్ణాహుతి కార్యక్రమంతో పాటు సాయినాథుని ఏకనామ సంకీర్తన నిర్వహించనున్నారు.

**22న గరికపాటి ప్రవచనం**

ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా ఈ నెల 22న ఉదయం 11 గంటలకు పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు హరికథా కాలక్షేపాలు ప్రారంభం కానున్నాయి.

**భక్తులకు సకల సౌకర్యాలు**

సాయినాథుని 108వ పుణ్యతిథి ఉత్సవాలు, శరన్నవరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాథుని ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

# అమ్మవారి ఆశీస్సులతో తీదేడును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా!

**● దుర్గామాత నవరాత్రుల సందర్భంగా రామాలయంలో సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు**
**● గ్రామ ప్రజల సుఖసంతోషాలే లక్ష్యం.. ఐక్యతతో సమగ్ర అభివృద్ధికి కృషి**



**చింతపల్లి అక్టోబర్ 11 (నేటి దర్శిని) :** దుర్గామాత ఆశీస్సులతో తీదేడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. దుర్గామాత నవరాత్రుల పవిత్ర సందర్భంగా తీదేడు గ్రామంలోని రామాలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు.

**ప్రజల సంక్షేమమే నిజమైన అభివృద్ధి**

ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి అంటే కేవలం మౌలిక సదుపాయాల కల్పనే కాదని, ప్రతి కుటుంబంలో ఆనందం, ప్రతి మహిళలో ఆత్మవిశ్వాసం, ప్రతి యువతలో భవిష్యత్తుపై ఆశ, ప్రతి పేద కుటుంబంలో భరోసా కల్పించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా అందరినీ కలుపుకొని తీదేడు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**మహిళా శక్తికి ప్రతీక నవరాత్రులు**

దుర్గామాత నవరాత్రులు మహిళా శక్తికి, ధైర్యానికి, ధర్మానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకలని అన్నారు. మహిళలు విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక చైతన్యంతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతోపాటు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు.

**ప్రజల సహకారంతో గ్రామ సమగ్రాభివృద్ధి**

గ్రామ పెద్దల ఆశీస్సులు, యువత భాగస్వామ్యం, ప్రజల సహకారంతో గ్రామ సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన పరిస్థితులు కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. దుర్గామాత కృపతో రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు నిండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు దుర్గామాత నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, గ్రామ పాలకవర్గ సభ్యులు, దుర్గమ్మ మాలధారణ భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 27 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక..

**ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



**గుర్రంపోడు, అక్టోబర్ 11 (నేటి దర్శిని):** గుర్రంపోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998--99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 27 సంవత్సరాల తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు పరస్పరం తమ పాత జ్ఞాపకాలను పంచుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. తమ జీవితాలకు విద్యాబాట చూపిన గురువులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. చాలాకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా కార్యక్రమాన్ని కొనసాగించారు. పాఠశాల రోజుల నాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్ కుమార్ రావు, ముషం యాదగిరి, సత్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, చింతరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ముషం సుప్రీత, మల్లికార్జున్‌తో పాటు పూర్వ విద్యార్థులు నల్ల రమేష్, మహేందర్, నరసింహ, ఏజాస్, యాదయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థుల సత్తా





- 9 పతకాలతో మెరిసిన క్రీడాకారులు..
- 3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలు కైవసం

**రంగారెడ్డి, అక్టోబర్ 11 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగాల్లో తమ ప్రతిభను చాటుతూ మొత్తం 9 పతకాలను సాధించారు. ఇందులో 3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. విద్యార్థుల విజయంతో పాఠశాలలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

**బాలికల విభాగంలో లాస్య శ్రీ మెరుపులు**

బాలికల అండర్-10 విభాగంలో సీహెచ్. లాస్య శ్రీ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందాల్లో స్వర్ణ పతకాలు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఇదే విభాగంలో లంక పార్వతి రెండు పరుగు పందాల్లో రజత పతకాలను కైవసం చేసుకుంది. ఫీల్డ్ ఈవెంట్లలో అండర్-10 బాలికల లాంగ్‌జంప్‌లో సాన్విక గౌడ్ కాంస్య పతకాన్ని సాధించింది. అండర్-12 బాలికల లాంగ్‌జంప్‌లో ఎం. అశ్విని రజత పతకాన్ని గెలుచుకుంది. అండర్-14 బాలికల 60 మీటర్ల పరుగు పందెంలో సింధం వజ్ర వరుణవి కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

**బాలుర విభాగంలోనూ పతకాల పంట**

బాలుర అండర్-12 విభాగంలో 300 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్. రితేష్ రజత పతకాన్ని సాధించగా, సీహెచ్. జీవన్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. బాలబాలికలు పట్టుదల, క్రమశిక్షణతో పోటీల్లో రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. విద్యార్థుల కఠోర సాధనతో పాటు తల్లిదండ్రులు, కోచ్‌లు, పాఠశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహమే ఈ విజయానికి కారణమని పాఠశాల వర్గాలు తెలిపాయి. పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ వారిని క్రీడారంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు పాఠశాల నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంది. జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు సాధించిన విజయంపై యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ బృందం హర్షం వ్యక్తం చేసింది.

# ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

**నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**







**ఎల్బీనగర్, అక్టోబర్ 11 (నేటి దర్శిని):** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, నైపుణ్యాభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందడంతో పాటు సమాజం పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట డివిజన్ యువ నాయకురాలు సంధ్య రవి ముదిరాజ్ అధ్యక్షతన చంపాపేట డివిజన్ పరిధిలోని మోడల్ మార్కెట్ భవన ఆవరణలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా మహిళలు సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఒక మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే ఆ కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, కుటుంబాల అభివృద్ధితో సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణతో పాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధికి ఉపయోగపడే కోర్సుల్లోనూ శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాల వరకు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించుకోవడంతో పాటు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యతనిస్తూ జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ఉష, ప్యారి, కవిత, లావణ్య, స్వయం ప్రభు, ట్రస్ట్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పూర్తి చేసిన మహిళలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాల సందడి





- రంగురంగుల పూలతో ఆకట్టుకున్న బతుకమ్మలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక: ప్రధానోపాధ్యాయుడు సీ.హెచ్ రమేష్

**పటాన్చెరు అక్టోబర్ 11(నేటి దర్శిని)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ముత్తంగి గ్రామంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో అంబరాన్నంటాయి. విద్యార్థినులు, మహిళలు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను సర్వాంగ సుందరంగా పేర్చి పండుగ శోభను తీసుకొచ్చారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. ప్రత్యేక పూజల అనంతరం బతుకమ్మ పాటలు ఆలపిస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో మార్మోగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రమేష్ మాట్లాడుతూ.. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. మారుతున్న ఆధునిక సమాజంలో భావితరాలకు తెలంగాణ పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వాడియాల గ్రామంలో దుర్గామాత ఆగమనానికి ఘన స్వాగతం





**మిడ్జిల్, అక్టోబర్ 11 (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామంలో దుర్గామాత ఆగమన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి స్వాగతం పలికేందుకు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి మండపం భక్తులను ఆకట్టుకుంది. దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి ఆగమనంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో గ్రామస్థులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# కోనాపూర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

- టీమ్ ఫ్రెండ్స్ ఆడపడుచుల ఆధ్వర్యంలో అన్నదానం





**ఆమనగల్లు, అక్టోబర్ 11(నేటి దర్శిని);** ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజారులు వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా టీమ్ ఫ్రెండ్స్ ఆడపడుచులు ముందుకొచ్చి దుర్గామాత విగ్రహాన్ని దానం చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన భక్తులు కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. నవరాత్రి వేడుకలతో కోనాపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆడపడుచులు చేపట్టిన సేవా కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. భక్తి, ఐకమత్యం, సేవాభావంతో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, కార్యక్రమ నిర్వాహకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రెసెంట్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎం.డి.ఆర్ ఫౌండేషన్
- కో-ఫౌండర్ మాద్రి తన్విశ్రీ
- సాంస్కృతిక వేడుకలతో విద్యార్థుల్లో ఐక్యతాభావం పెంపొందుతుంది






**పటాన్‌చెరు, అక్టోబర్ 11 (నేటి దర్శిని)** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో ఉన్న క్రెసెంట్ గ్లోబల్ స్కూల్‌లో దాండియా ఉత్సవం--2026 ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎం.డి.ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ సతీమణి మాద్రి తన్విశ్రీ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా మాద్రి తన్విశ్రీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి సాంస్కృతిక వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు దాండియా వంటి ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూ వేడుకలను నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## వారం రోజుల్లో భారీగా పెరిగిన బంగారం ధర!

-పండుగల సీజన్‌లో పసిడి ధరలకు రెక్కలు
-24 క్యారెట్ల బంగారంపై రూ.2,240 పెరుగుదల
-22 క్యారెట్ల ధర కూడా రూ.2,050 పైకి
-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,51,420
-కిలో వెండి ధర రూ.2.45 లక్షల వద్ద స్థిరం
-రానున్న రోజుల్లోనూ ధరలు పెరిగే అవకాశం



**హైదరాబాద్:**
పండుగల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరలు భారీగా పెరిగాయి. గత వారం రోజుల్లోనే పసిడి ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులపై భారం పెరుగుతోంది. అక్టోబర్ 5న హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,180గా ఉండగా, అక్టోబర్ 11 ఆదివారం నాటికి రూ.1,51,420కు చేరింది. దీంతో వారం రోజుల్లోనే రూ.2,240 పెరిగింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర కూడా అదే బాటలో పెరిగింది. అక్టోబర్ 5న 10 గ్రాముల ధర రూ.1,36,750గా ఉండగా, ప్రస్తుతం రూ.1,38,800కు చేరుకుంది. అంటే వారంలో రూ.2,050 పెరిగింది. పండుగలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఈ పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కిలో వెండి ధర రూ.2.45 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## మళ్లీ రీఛార్జ్ ధరల పెంపు!

-మరోసారి 12 నుంచి 15 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం
-వచ్చే నాలుగైదు నెలల్లో టారిఫ్‌ల పెంపునకు అంచనాలు
-జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వినియోగదారులపై ప్రభావం
-5జీ సేవల విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణకు పెరుగుతున్న ఖర్చులు
-వినియోగదారుడి నుంచి సగటు ఆదాయం పెంచుకోవడంపై కంపెనీల దృష్టి
-సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం

న్యూఢిల్లీ
దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులకు మరోసారి రీఛార్జ్ ధరల పెంపు ముప్పు పొంచి ఉంది. వచ్చే నాలుగైదు నెలల్లో టెలికాం టారిఫ్‌లు 12 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. మార్కెట్‌లో పోటీ సంస్థల సంఖ్య తగ్గడం, ధరల పెంపునకు అనుకూల పరిస్థితులు ఏర్పడటం ఇందుకు కారణాలుగా పేర్కొంది. అయితే, టెలికాం కంపెనీలు ధరల పెంపుపై అధికారికంగా ప్రకటన చేయలేదు.



జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన టెలికాం సంస్థలు తమ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. 5జీ సేవల విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయాన్ని పెంచుకోవడంపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.
ఇప్పటికే రీఛార్జ్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మరోసారి ధరలు పెరిగితే అదనపు భారం పడనుంది. నెలవారీ ఖర్చులు పెరగడంతోపాటు, దీర్ఘకాలిక రీఛార్జ్ ప్రణాళికల ఎంపికపైనా వినియోగదారులు ఆలోచించాల్సి రావచ్చు. అయితే, ధరల పెంపు ఎప్పుడు అమల్లోకి వస్తుంది, ఏయే ప్లాన్లపై ఎంతమేర ప్రభావం ఉంటుంది అనే అంశాలపై ఆయా సంస్థల అధికారిక ప్రకటనల తర్వాతే స్పష్టత రానుంది.

## ఈ వారం మార్కెట్లకు పరీక్ష!

-ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం
-ద్రవ్యోల్బణ గణాంకాలపై మదుపర్ల దృష్టి
-కంపెనీల త్రైమాసిక ఫలితాలతో షేర్లలో కదలికలు
-ముడి చమురు ధరలు, రూపాయి విలువ కీలకం
-విదేశీ పెట్టుబడిదారుల లావాదేవీల ప్రభావం

ఆచితూచి పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలని నిపుణుల సూచన ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాలు, ప్రముఖ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేయనున్నాయి. దీంతో మదుపర్లు కీలక సూచీల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాల ధోరణి ఆయా పరిణామాలపై ఆధారపడి ఉండనుంది. ఈ వారం కంపెనీల త్రైమాసిక ఫలితాలు కీలకంగా మారనున్నాయి. సంస్థల ఆదాయం, లాభాలు, భవిష్యత్తు వ్యాపార అంచనాలు ఆశాజనకంగా ఉంటే ఆయా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. ఫలితాలు నిరాశపరిస్తే అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. మరోవైపు




ద్రవ్యోల్బణ గణాంకాలు వడ్డీ రేట్లపై అంచనాలను ప్రభావితం చేయనున్నాయి. ఈ వివరాలను బట్టి మదుపర్లు తమ పెట్టుబడి వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో మార్పులు కూడా దేశీయ మార్కెట్లకు కీలకం కానున్నాయి. చమురు ధరలు పెరిగితే దిగుమతి వ్యయం అధికమై దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగవచ్చు. దీనికి తోడు విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు, అమ్మకాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువలో హెచ్చుతగ్గులు మార్కెట్ దిశను నిర్ణయించడంలో ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో మదుపర్లు మార్కెట్ పరిణామాలను జాగ్రత్తగా గమనించాలి. కంపెనీల ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్తు అంచనాలను విశ్లేషించిన తర్వాతే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

## టీమిండియాతో వన్డే సిరీస్..
## న్యూజిలాండ్ విధ్వంసక ఓపెనర్లకు పిలుపు..!

స్వదేశంలో భారత జట్టుతో వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ విధ్వంసక ఓపెనర్లను స్క్వాడ్‌లోకి తీసుకుంది. పలువురు ఆటగాళ్లు గాయపడడంతో.. డేంజరస్ ఫిన్ అలెన్ , టిమ్ సీఫర్ట్ లను ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఆదివారం ఉదయం మిచెల్ శాంట్నర్ సారథిగా 14 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. గాయం నుంచి కోలుకున్న చాప్‌మన్, రచిన్ రవీంద్రలకు చోటు దక్కింది. టీమిండియా సవాల్‌కు సిద్ధమవుతున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు స్క్వాడ్‌ను ప్రకటించింది. పలవురు ఆటగాళ్లను గాయాలు వెంటాడుతున్న వేళ తొలి మూడు వన్డేలకు.. చివరి రెండు వన్డేలకు కొన్ని మార్పులతో పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఐదు వన్డేల సిరీస్‌లో.. 4, 5వ మ్యాచ్‌లకు సీనియర్ బ్యాటర్ ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్‌లను తీసుకున్నారు. మూడేళ్ల క్రితం అలెన్ చివరి వన్డే ఆడగా.. సీఫ్టర్ 18 నెలల తర్వాత స్క్వాడ్‌లోకి వచ్చాడు. గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన రచిన్ రవీంద్ర, మార్క్ చాప్‌మన్‌లు స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. డెవాన్ కాన్వే, విల్ యంగ్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిఫ్స్‌తో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. ఇక బౌలింగ్ యూనిట్‌లో జాకబ్ డఫ్ఫీ, కైలీ జేమీసన్, మ్యాట్ హెన్రీ, బ్లెయిర్ టిక్నర్ ఉన్నారు. మూడేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో భారత్‌పై సెమీస్‌లో ఆడిన ఫెర్గూసన్ పేస్ దళంలో






కీలకం కానున్నాడు.
**న్యూజిలాండ్ స్క్వాడ్(తొలి మూడు వన్డేలకు):** మిచెల్ శాంట్నర్(కెప్టెన్), మైఖేల్ బ్రాస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, నాథన్ స్మిత్, విల్ యంగ్, జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ హెన్రీ, కైలీ జేమీసన్, టామ్ లాథమ్(వికెట్ కీపర్), బ్లెయిర్ టిక్నర్.
**న్యూజిలాండ్ స్క్వాడ్(4, 5 వన్డేలకు):** మిచెల్ శాంట్నర్(కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రాస్‌వెల్, మార్క్ చాప్‌మన్, క్రిస్టియన్ క్లార్కేలాకీ ఫెర్గూసన్, మిచ్ హే(వికెట్ కీపర్), నిక్ కెల్లీ, టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), విల్ యంగ్, జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ ఫిషర్, బ్లెయిర్ టిక్నర్.
అక్టోబర్ మూడో వారంలో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది భారత జట్టు. అక్టోబర్ 22 నుంచి శ్రేయాస్ అయ్యర్ సేన, కివీస్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఆపై నవంబర్ 4వ నుంచి ఇరుజట్లు ఐదు వన్డేల్లో తలపడతాయి. అనంతరం నవంబర్ 19 నుంచి రెండు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొట్టనుంది.

## రంజీ ట్రోఫీలో జైస్వాల్, రాహుల్‌కు నిరాశ

-రంజీ ట్రోఫీ 2026--27 సీజన్ ప్రారంభం
-తొలి రోజే విఫలమైన భారత టెస్టు జట్టు ఆటగాళ్లు
-పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన జైస్వాల్
-కేవలం నాలుగు పరుగులకే ఔటైన కేఎల్ రాహుల్
-ముంబై తరపున బరిలోకి దిగిన జైస్వాల్
-కర్ణాటక జట్టు తరపున ఆడిన రాహుల్

భారత దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీ అయిన రంజీ ట్రోఫీ 2026--27 సీజన్ ఆదివారం ప్రారంభమైంది. ఈ టోర్నీలో బరిలోకి దిగిన భారత టెస్టు జట్టు ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తొలి రోజే నిరాశపరిచారు. భారీ ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుంటారని అభిమానులు ఆశించిన ఈ ఇద్దరు స్టార్ క్రికెటర్లు స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. ముంబై జట్టు తరపున చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో



ఆడిన యశస్వి జైస్వాల్ పరుగుల ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. ఆరంభంలోనే వికెట్ కోల్పోవడంతో ముంబై జట్టుకు నిరాశ ఎదురైంది. మరోవైపు కర్ణాటక జట్టు తరపున బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ కేవలం నాలుగు పరుగులకే వికెట్ కోల్పోయాడు. ఇద్దరు కీలక ఆటగాళ్లు ఇలా స్వల్ప స్కోర్లకే వెనుదిరగడం అభిమానులను నిరాశకు గురిచేసింది. రంజీ ట్రోఫీలో రాణించి తమ ఆటతీరును మెరుగుపరుచుకోవాలని భావించిన ఈ ఆటగాళ్లకు తొలి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. రాబోయే మ్యాచ్‌ల్లో జైస్వాల్, రాహుల్ తిరిగి ఫామ్‌లోకి వచ్చి భారీ స్కోర్లు సాధిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

# స్పోర్ట్స్

## టెస్టుల్లో తొలి హ్యాట్రిక్..
## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్..!



బంగ్లాదేశ్ క్రికెట్‌లో పేస్ సంచలనంగా మారిన హసన్ మహమూద్ ఈసారి హ్యాట్రిక్‌తో మెరిశాడు. ఆస్ట్రేలియాపై డార్విన్ టెస్టులో చరిత్రాత్మక విజయంలో భాగమైన అతడు అఫ్గనిస్థాన్ తో ఏకైక టెస్టులో వరస బంతుల్లో మూడు వికెట్లతో చెలరేగాడు. తద్వారా సుదీర్ఘ ఫార్మాట్‌లో హ్యాట్రిక్ నమోదు చేసిన బంగ్లాదేశ్ మొట్టమొదటి పేసర్‌గా అవతరించాడు. మొత్తంగా రెడ్ బాల్ క్రికెట్‌లో తమ దేశం నుంచి ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్‌గా హసన్ గుర్తింపు సాధించాడు. అఫ్గనిస్థాన్‌తో అబుధాబీలో జరుగుతున్న ఏకైక టెస్టులో హసన్ మహమూద్ నిప్పులు చెరిగాడు. పదునైన పేస్‌తో కాబూలీ బ్యాటర్లను ఇరుకున పెట్టిన అతడు 83వ ఓవర్లో హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. మూడో బంతికి ఇస్మత్ అలంను క్లీన్ బౌల్డ్ చేసిన హసన్.. ఆ తర్వాత బంతికి కైస్ అహ్మద్‌ను వెనక్కి పంపాడు. హ్యాట్రిక్ బంతికి జియా ఉర్ రెహ్మన్‌ను ఎల్బీగా ఔట్ చేసి చరిత్ర లిఖించాడీ స్పీడ్‌స్టర్. తద్వారా టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన బంగ్లా తొలి పేసర్‌గా హసన్ అవతరించాడు. హసన్ కంటే ముందు టెస్టుల్లో మాజీ స్పిన్నర్లు అలోక్ కపాలి, షోహగ్ గజీలు ఈ ఫీట్ సాధించారు. పాకిస్థాన్‌పై 2003 ఆగస్టులోకపాలి తన స్పిన్ మ్యాజిక్ చూపిస్తూ వరస బంతుల్లో టెయిలెండర్లు షబ్బీర్ అహ్మద్, డానిష్ కనేరియా, ఉమర్ గుల్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత పదేళ్లకు న్యూజిలాండ్‌పై గజీ.. కొరే అండర్సన్, వాల్టింగ్, బ్రేస్‌వెల్‌ను ఔట్ చేయడం ద్వారా హ్యాట్రిక్ నమోదు చేశాడు.

**వన్డేల్లో ఐదుగురు**
అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లను పరిగణిస్తే.. వన్డేల్లో ఐదుగురు బంగ్లా బౌలర్లు హ్యాట్రిక్ వికెట్లతో ఔరా అనిపించారు. షహదాత్ హొసేన్ 2006లో జింబాబ్వేపై, అబ్దుల్ రజాక్ 2010లో జింబాబ్వేపై, రూబెల్ హొసేన్ 2013లో న్యూజిలాండ్‌పై, తైజుల్ ఇస్లాం 2014లో జింబాబ్వేపై, తస్కిన్ అహ్మద్ 2017లో శ్రీలంకపై హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు.

# విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్..

## - 'రణబాలి' డబ్బింగ్ వెర్షన్స్ విడుదల వాయిదా!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పెళ్లి తర్వాత ఈ క్రేజీ కాంబో తెరపైకి వస్తుండటం, అటు 'టాక్సీవాలా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రాహుల్ సాంకృత్యాన్ -- విజయ్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అనుకున్న తేదీ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే, ఓవర్సీస్ మార్కెట్లోని ప్రేక్షకులకు, ముఖ్యంగా నాన్-తెలుగు విజయ్ ఫ్యాన్స్‌కు మేకర్స్ నుంచి నిరాశ కలిగించే అప్‌డేట్ అందింది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ల సమాచారం ప్రకారం.. అక్టోబర్ 16న విడుదల రోజున విదేశాల్లో కేవలం ఒరిజినల్ తెలుగు వెర్షన్ మాత్రమే ప్రదర్శించబడుతుంది. ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్‌లకు సంబంధించిన కంటెంట్ సిద్ధం చేయడంలో ఏర్పడిన ఆలస్యం కారణంగా, వాటి రిలీజ్‌ను అక్టోబర్ 23కి వాయిదా వేశారు. మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ థియేటర్ చైన్‌లలో ఇప్పటికే టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా, కేవలం ప్రీ-సేల్స్ ద్వారానే సినిమా 50 వేల డాలర్ల మార్కును దాటడం విశేషం. రాబోయే రోజుల్లో ప్రీమియర్ కలెక్షన్స్ ఏ స్థాయిలో ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అద్భుతమైన బాణీలు అందిస్తున్న ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



# గ్లామర్ రూటులో ఐశ్వర్య రాజేష్

# రజనీకాంత్ 'ధర్మన్'పై భారీ అంచనాలు..

## -2027 సంక్రాంతి నుంచి వేసవికి వాయిదా?




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి పెంచుతున్న చిత్రాల్లో 'ధర్మన్' ఒకటి. విభిన్న కథాంశాలతో సినిమాలు తెరకెక్కించే దర్శకుడు అశ్విత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న ఈ ప్రాజెక్టులో రామ్ పోతినేని, రాశీ ఖన్నా, సిమ్రాన్, యోగి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. అయితే మొదట అనుకున్న విడుదల తేదీ విషయంలో మార్పులు జరిగే అవకాశం ఉందనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.రజనీకాంత్ నటిస్తున్న సినిమాలంటే ప్రేక్షకుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. ముఖ్యంగా 'జైలర్' విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్టులపై అభిమానులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో 'జైలర్ 2' తర్వాత 'ధర్మన్' గురించి వస్తున్న వార్తలు ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, కథ, విడుదల తేదీ వంటి వివరాలపై అధికారిక ప్రకటనల కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడు అశ్విత్ మారిముత్తు గతంలో 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. వినోదంతో పాటు భిన్నమైన కథనాన్ని అందించే ప్రయత్నం ఆయన సినిమాల్లో కనిపిస్తుంది. అలాంటి దర్శకుడు ఈ భారీ ప్రాజెక్టును ఎలా రూపొందించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. రజనీకాంత్ పేరుతో ముడిపడిన ఈ చిత్రం గురించి వస్తున్న అంచనాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ఈ సినిమాకు కమల్ హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తుండటం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నటుడిగా ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కమల్ హాసన్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్టు ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. భారీ తారాగణం, అనుభవజ్ఞులైన సాంకేతిక బృందం కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ విలువలపైనా అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 'ధర్మన్' విడుదల తేదీపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాను మొదట 2027 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు విడుదల ప్రణాళికల్లో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కమల్ హాసన్ తన మరో చిత్రం 'ఇండియన్ 3'ను పండగ సీజన్‌లో విడుదల చేయాలని యోచిస్తున్నారనే వార్తల నేపథ్యంలో 'ధర్మన్'ను 2027 వేసవికి వాయిదా వేయవచ్చని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



# ఏమీ చేయలేకే గతాన్ని తవ్వుతారు!

'మనల్ని విమర్శించడానికి ఏమీ దొరకనప్పుడు మన గతాన్ని వెలికితీస్తారు. చవకబారు ఆరోపణలు చేసి ఏదో సాధించామని సంబరపడిపోతారు. నా విషయంలో అదే జరిగింది. ఎవరితోనైనా ప్రేమగా మాట్లాడినా, చిరునవ్వుతో పలకరించినా లవ్‌ఎఫైర్ అంటూ ప్రచారం చేశారు. నా స్నేహితుల దగ్గరి నుంచి ప్రేమించే వ్యక్తుల వరకూ.. ప్రతి ఒక్కరిని పరిచయం చేయడానికి నేను ఇష్టపడతాను. ఎప్పటికప్పుడు నా సినిమా విశేషాలను పంచుకుంటూ సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటాను. ఇంత ఓపెన్‌గా ఉంటున్నప్పటికీ నా మీద ఎందుకు పుకార్లు వ్యాప్తి చేస్తారో అర్థం కాదు. కొన్నిసార్లు వారి వినోదం కోసం వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తుంటారు' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. ఆమె తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ఇటీవలే ఓటీటీలో ప్రేక్షకుల ముందుకొచ్చింది.

# జూనియర్ సైంటిస్ట్‌గా శర్వానంద్..

## -రామోజీ ఫిల్మ్‌సిటీలో 'జార్జ్ క్రిష్' ఊరమాస్ షూటింగ్!




టాలీవుడ్ హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'జార్జ్ క్రిష్' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచేందుకు వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్ర యూనిట్ అత్యంత భారీ సెట్లను నిర్మించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అక్కడే ఒక అద్భుతమైన షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే హీరో శర్వానంద్‌పై ఒక అదిరిపోయే 'జార్జ్ క్రిష్' టైటిల్ సాంగ్‌ను గ్రాండ్‌గా షూట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో శర్వానంద్ చాలా డిఫరెంట్‌గా జూనియర్ సైంటిస్ట్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన క్యారెక్టర్ చుట్టూ నడిచే సన్నివేశాలు, వైట్ల మార్క్ కామెడీ టైమింగ్ సినిమాకే హైలైట్‌గా నిలవనున్నాయి. ఫుల్-లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ఎన్నో హిలేరియస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలాఉంటే, ఈ సినిమాలో శర్వానంద్ సరసన అందాల భామ మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి మధ్య వచ్చే లవ్ ట్రాక్ పూర్తిగా ట్రెండీగా, యూత్‌ను ఆకట్టుకునేలా వైవిధ్యమైన ఫన్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుందని తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంగీత సంచలనం అనూప్ రూబెన్స్ అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ తో పాటు శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ తో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి మరి.

# తమిళ దర్శకుడితో భారీ అడ్వెంచర్?



వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సిక్' సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం నితీష్ తివారీ 'రామాయణం'లో రావణుడిగా నటిస్తూ యశ్ బిజీగా ఉన్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతున్నది. ఈ చిత్రానికి సంబంధించిన తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.మరి 'రామాయణ' ఫ్రాంచైజీ తర్వాత యశ్ చేసే సినిమా ఏంటి? ఆయన సోలో హీరోగా ఎవరి దర్శకత్వంలో నటిస్తారు? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో ప్రస్తుతం చర్చనీయాంశాలుగా మారాయి. అయితే.. తాజాగా తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ ఇచ్చిన అప్‌డేట్‌తో ఈ చర్చలకు ఫుల్‌స్టాప్ పడ్డట్టయింది. 'ఇండియానా జోన్స్' తరహాలో ఒక భారీ అడ్వెంచర్ కథను ఇటీవలే యశ్‌కు వినిపించానని, యశ్‌కు కూడా ఆ కథ బాగా నచ్చిందని, 'రామాయణ' కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక, ఈ ప్రాజెక్ట్ వర్క్ మొదలవుతుందని మిత్రన్ చెప్పారు. ఇది యశ్ అభిమానులకు నిజంగా శుభవార్తే.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365